PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

శనివారం 26-09-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :116 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## గంగమ్మ ఒడికి గౌరీ తనయుడు..
## భక్తజనసందోహం నడుమ నిమజ్జనం

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:**
ఖైరతాబాద్ బడా గణేశుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్ద నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఖైరతాబాద్ నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ఈ శోభాయాత్ర కొనసాగింది. మధ్యాహ్నం 2.15 గంటలకు హుస్సేన్‌సాగర్‌లో భారీ క్రేన్ల సాయంతో నిమజ్జన ప్రక్రియను పూర్తిచేశారు.

## బాలాపూర్ లడ్డూకు రికార్డు ధర
# రూ.39 లక్షల



హైదరాబాద్: నగరంలోని బాలాపూర్‌లో గణేశుడి లడ్డూ వేలం పూర్తయింది. ఈసారి లడ్డూ రికార్డు ధర పలికింది. వనస్థలిపురంలోని సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్‌రెడ్డి సొంతమైంది. రూ.39లక్షలకు ఆయన దీన్ని సొంతం చేసుకున్నారు. వేలంలో పాల్గొనేందుకు 8 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా.. చివరికి ప్రణీత్‌రెడ్డిని లడ్డూ వరించింది. గతేడాది రూ.35 లక్షలు పలికింది. వినాయక ఉత్సవాల్లో బాలాపూర్‌కి ప్రత్యేక స్థానం ఉంది. స్వామివారికి సమర్పించే లడ్డూ ప్రసాదం ప్రత్యేక గుర్తింపు సాధించింది. నవరాత్రులు పూజలందుకునే స్వామివారి చేతిలోని 21 కిలోల లడ్డూను పొందడం ద్వారా శుభం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. అందుకే వేలంలో దక్కించుకునేందుకు పోటీ పడుతుంటారు.

**రూ.450 నుంచి నుంచి రూ.39 లక్షల వరకు..**
బాలాపూర్ వినాయకుడికి 45 ఏళ్ల ఘన చరిత ఉంది. లంబోదరుడిపై భక్తులకు ఉన్న విశ్వాసాన్ని ఇనుమడింపజేయాలన్న ఆలోచనతో మొట్టమొదటిసారిగా బాలాపూర్ ఉత్సవ సమితి 1994లో లడ్డూ వేలం నిర్వహించింది. మొదటిసారిగా లడ్డూ ప్రసాదాన్ని రూ.450కు కైవసం చేసుకున్న రైతు కొలను మోహన్‌రెడ్డి.. దాన్ని కుటుంబ సభ్యులు, బంధువులకు పంచి.. మిగతాది పొలాల్లో చల్లారు. 2లో



## ‘బ్రహ్మోస్’తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు: అమిత్ షా

- బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులంటూ అమిత్ షా
- ఏకే-203 రైఫిళ్లతో మావోయిస్టులు, ఉగ్రవాదులకు భయం
- ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ దాడులను గుర్తుచేసిన షా
- యూపీలో రక్షణ, వాహన రంగాల పురోగతి
- భారత్ స్థిరమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందని వ్యాఖ్య
- పలు దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడి
- ‘వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్’ విధానంపై ప్రశంసలు

2లో

## సీఎం రేవంత్‌కు ఆర్యదాన్ మొహమ్మద్
# బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు

### రాజ్యాంగ పరిరక్షణకు లౌకికవాదులు ఏకం కావాలి



- మతతత్వ శక్తులను అడ్డుకోవాలని రేవంత్ పిలుపు
- నిలంబూర్‌లో బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు
- మోదీపై ఓటు, పార్టీ, నిధుల చోరీ ఆరోపణలు
- యువత భవిష్యత్తును చోరీ చేస్తున్నారని విమర్శ
- రాజ్యాంగ వ్యతిరేక శక్తులను గద్దె దించాలని పిలుపు

రాజ్యాంగ పరిరక్షణకు లౌకికవాదులు అందరూ కలిసి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేరళంలో ఆర్యదాన్ మొహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా.. నిలంబూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును రేవంత్‌రెడ్డి అందుకున్నారు. అనంతరం మాట్లాడిన సీఎం.. దేశంలో మతతత్వ శక్తులను అడ్డుకోవడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు ఇచ్చే నివాళి అని తెలిపారు. కేరళంలో కాంగ్రెస్ సర్కార్ ఉన్న ప్రతిసారి.. కేంద్రంలోనూ అధికారంలో ఉండేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఓటు చోరీ, పార్టీ చోరీ, నిధుల చోరీ సహా.. దేశ యువత భవిష్యత్తును సైతం చోరీ చేస్తున్నారని ఆరోపించారు. దీన్ని అడ్డుకునేందుకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను గద్దె దించాలని

## వ్యవసాయ రంగంలో సీఎస్ఆర్ సహకారానికి పరిశ్రమలతో ఐకార్ భాగస్వామ్యాలను సులభతరం చేసిన అగ్రిఇన్నోవేట్ ఇండియా



న్యూఢిల్లీలో అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ 15వ వార్షిక సర్వసభ్య సమావేశం, 71వ బోర్డు సమావేశం

2లో

## సమర్థవంతమైన అటవీ నిర్వహణకు సామర్థ్య పెంపు ప్రాజెక్టు వర్క్‌షాప్ ప్రారంభం




### ప్రాంతాలవారీ అవసరాలు, స్థానిక పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వాలి: కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:**
జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) సహకారంతో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ‘సమర్థవంతమైన అటవీ నిర్వహణ కోసం సామర్థ్య పెంపు ప్రాజెక్టు’ వర్క్‌షాప్‌ను కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ శుక్రవారం న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్‌లో మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, జైకా ఇండియా సీనియర్ ప్రతినిధి, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అటవీ శాఖల ప్రతినిధులు, భారతీయ పరిశోధనా సంస్థలు, అటవీ రంగంలోని కేంద్ర శిక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 2లో

## నిమజ్జనోత్సవాల ప్రక్రియను వేగంగా
# పూర్తి చేయాలి

హైదరాబాద్: గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను ఉత్సవ నిర్వాహకులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. వర్షం కురిసే అవకాశమున్నందున నిర్వాహకులు ఈ దిశగా ఆలోచించాలని కోరారు. ఈ రోజు రాత్రి వరకు నిమజ్జనోత్సవాన్ని పూర్తి చేయాలనే భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను మంత్రి పొన్నం ప్రభాకర్ డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనర్, కలెక్టర్ ప్రియాంక అల, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో కలిసి విహంగ వీక్షణం చేశారు.

**గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ బడా గణేశుడు**
హుస్సేన్ సాగర్ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. డప్పు చప్పుళ్లు, భక్తుల ఆటపాటలు, నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో మొత్తం 114 నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం కోసం 14,840 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటికే 10వేలకు పైగా విగ్రహాలు పూర్తయ్యాయని సీపీ సజ్జనర్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం లోపు అన్ని విగ్రహాల నిమజ్జనం పూర్తవుతుందని భావిస్తున్నట్టు చెప్పారు.





## ఆరు దేశాల రాయబారుల నుంచి ఆధారపత్రాలు స్వీకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



2లో

## 23 రోజుల్లో 6 వేల మీటర్లకు పైబడిన 20 పర్వత శిఖరాల అధిరోహణ

### చరిత్ర సృష్టించిన నిమాస్ పర్వతారోహక బృందం యాత్రను అభినందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్




2లో

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్
సందేశం టైమ్స్
నిజం దాగదు - వార్త ఆగదు
26-09-2026

# సంపాదకీయం

## మానవుడిక మహనీయుడూ మాననీయుడు కాదా?

ప్రకృతిని జయించటం, అనుభవించటం అన్నవి మనిషి ఆలోచనలను 250 ఏళ్లపాటు తీవ్రంగా ప్రభావితం చేశాయి. చరాచర ప్రపంచంతో పాటు సమస్త జంతు, వృక్ష సంపద మనుషుల అవసరాలు, ఆనందాల కోసమే ఉందన్నట్లుగా పరిగణించటం పారిశ్రామిక విప్లవం తర్వాత కనీవినీ ఎరగని రీతిలో ఊపందుకుంది. హద్దులూ, అవధులూ లేకుండా మనిషి జైత్రయాత్ర ప్రకృతిపై సాగుతూనే ఉంటుందని ఎందరో శాస్త్రవేత్తలూ తత్వవేత్తలూ ప్రగతి గానాలు చేశారు. మరెందరో కవులూ, కళాకారులూ వాటితో గొంతు కలిపారు. 'మానవుడే మహనీయుడు.. శక్తియుతుడు.. యుక్తిపరుడు.. మానవుడే మాననీయుడు.. జీవకోటి సర్వములో శ్రేష్ఠతముడు.. మానవుడే మహనీయుడు.. మహనీయుడు..' అంటూ ప్రముఖ కవి ఆరుద్ర 1972లో బాలభారతం సినిమాలో రాసిన పాట దీన్నే గుర్తుచేస్తుంది. 'గ్రహరాశులనధిగమించి.. ఘనతారల పథం నుంచి.. గగనాంతర రోదసిలో.. గంధర్వగోళతతుల దాటి.. బొందితో భువికి తిరిగి రాగలిగే' ఘనశక్తి మనిషికే ఉందని గొప్పగానూ శ్లాఘించారు. 'మెదడన్నది మనకున్నది.. అదిసరిగా పనిచేస్తే.. విశ్వరహః పేటికా విపాటన జరగక తప్పదు' అని శ్రీశ్రీ మానవమేధ ఔన్నత్యానికీ, ఆధిక్యానికీ అక్షరరూపమిచ్చారు. సృష్టికి ప్రతిసృష్టి చేసే శక్తి మనిషి మెదడుకు ఉండటమే అద్భుతమని అనుకున్న దశ నుంచీ ఆ ప్రతిసృష్టిని చూసి భయపడే స్థితికి మనం చేరుకోవటం ఇప్పుడు సవాల్‌గా పరిణమించింది. కృత్రిమమేధ (ఏఐ)తో మనిషి తన ఆధిపత్యానికి తనే మరణశాసనం రాసుకుంటున్నట్లుగా భావించే విపరీత వ్యాఖ్యానాలతో పాటు ఆర్థికరంగంలో అది చూపించే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆ సవాల్‌ను అంత తేలికగా తీసుకోలేం.

ఇప్పటివరకూ మనం శాస్త్రసాంకేతిక రంగంలో ఎన్నో విప్లవాలను చూశాం. అవన్నీ మనుషుల సౌకర్యాలను, సంతోషాలను గణనీయంగా పెంచి అంతేస్థాయిలో పర్యావరణాన్ని దెబ్బతీశాయి. అందుకే 1970ల నుంచి పర్యావరణ చైతన్యం క్రమేపీ బలపడి అభివృద్ధి పేరుతో, ప్రకృతిని జయించటం పేరుతో దేన్నైనా చేయొచ్చనే ధోరణికి బంధనాలు వేయటానికి ఎన్నో విధానాలు రూపొందాయి. మనుషులు భద్రంగా బతకటానికి అవసరమైన పర్యావరణం ఉండాలంటే పారిశ్రామిక యుగం కంటే ముందున్న భూ ఉష్ణోగ్రతలను రెండు డిగ్రీల సెల్సియస్ మించకుండా చూడాలని ప్యారిస్ వాతావరణ ఒప్పందం తీర్మానించటానికి కూడా ఈ నేపథ్యమే కారణం. గతంలోని శాస్త్ర సాంకేతిక విప్లవాలు ఏవీ మనుషుల నియంత్రణను దాటిపోయే ప్రమాదాన్ని తీసుకురాలేదు. అపరిమిత లాభాల కోసమూ, కంపెనీలు, దేశాల మధ్య ఆధిపత్యం కోసమూ శాస్త్రసాంకేతిక రంగాలను దుర్వినియోగం చేసి యుద్ధాలనూ పర్యావరణ విధ్వంసాలనూ కొనితెచ్చినా, అవసరమనుకున్నప్పుడు ఆ రంగాలను అదుపులో పెట్టగలిగే పరిస్థితి ఎంతో కొంత ఉండేది. ఏఐని అలా అదుపులో ఉంచే పరిస్థితి ఉండదనీ మనిషి అదుపాజ్ఞలను అది తోసిపుచ్చి, స్వయం నిర్ణయాలను తీసుకునే తీవ్ర ప్రమాదాన్ని కొట్టిపారేయలేమనే వ్యాఖ్యానాలు బలంగా వినపడుతున్నాయి. ఏఐ రంగంలో అగ్రగాములుగా ఉన్న నిపుణులు, కంపెనీల అధినేతల నుంచే ఇలాంటి భయాలు వెల్లడికావటంతో అంతర్జాతీయస్థాయిలో ఏఐపై నియంత్రణ ఉండాలనే భావన బలం పుంజుకుంటోంది. మానవ అస్తిత్వానికీ, మనిషి సహజశక్తులకూ భంగం కలగని రీతిలో ఏఐని కట్టడిచేయటానికి ప్రయత్నాలు జరగకపోతే కలిగే అనర్థాలు చాలా ఉంటాయి. ఇప్పటికే ఏఐ పేరుతో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. అగ్రశ్రేణి కంపెనీలే వరసపెట్టి లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి.

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా ప్రకారం 40శాతం ఉద్యోగాలు (మరో అంచనా ప్రకారం అది 60శాతం వరకూ ఉండొచ్చు) ఏఐతో ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. డేటా ఎంట్రీ, కస్టమర్ సర్వీస్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్, లా, అకౌంటింగ్, మెడిసిన్, టీచింగ్, జర్నలిజం, గ్రాఫిక్ డిజైనింగ్-- కంటెంట్ క్రియేషన్, ట్రాన్స్‌లేషన్ లాంటి రంగాల్లో ఉద్యోగాల కోతలు తీవ్రంగా ఉంటాయి. టీచింగ్, జర్నలిజం లాంటి రెండు రంగాలను ఉదాహరణగా తీసుకుంటే ఏఐ ప్రభావం ఎలా ఉంటుందో తేలికగానే ఊహించొచ్చు. ఒక్క ఏఐ ట్యూటర్ వేలమంది టీచర్లు చేసే పనిని అతి తేలికగా చేయగలదు. విద్యార్థుల స్థాయినీ, వారు చేసే తప్పులనూ, వారు లేవనెత్తే ప్రశ్నలనూ నిమిషాల్లో గుర్తించగలదు. ప్రతి విద్యార్థికి సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాన్ని స్పష్టం చేయగలదు. ఇక జర్నలిజానికి అవసరమైన అనేక విషయాలను సంగ్రహపరచి పాఠకులకు అర్థమయ్యేరీతిలో కథనాలను తేలికగా తయారు చేస్తుంది. క్రీడా విశేషాలూ, ఫైనాన్షియల్ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థకూ సంబంధించిన న్యూస్‌నూ, వీడియోలను అనుసరించి కావాల్సిన భాషల్లో లిఖిత రూపంలో ఇవ్వటమూ, అనువాదాన్ని అందించటమూ, వివిధ పరిణామాలనూ సంక్షిప్త-- దీర్ఘవార్తలుగా తీర్చిదిద్దటమూ, గణాంకాలనూ-- డేటానూ అవసరాలకు తగ్గట్టుగా విశ్లేషించి-- వర్గీకరించటమూ నిమిషాల్లో చేయగలగటంతో జర్నలిజంలో మానవవనరుల వినియోగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

ఉద్యోగాలను దెబ్బతీయటం ఏఐ ఏ స్థాయిలో చేయగలదో ఇంకా పూర్తిగా స్పష్టం కావటం లేదు. గతంలోనూ కొత్త సాంకేతిక పరిజ్ఞానం వచ్చినప్పుడు దాని ప్రభావాన్ని అంచనా వేయటానికి చాలాకాలమే పట్టింది. క్యాపిటలిజంగా మనం పిలిచే ఆర్థిక వ్యవస్థలో మార్పులు అనూహ్యంగా వస్తాయి. మలుపులు కూడా అనూహ్యంగా ఉంటాయి. దాని సాధారణ స్వరూపమూ, నడవడిక గురించి అవగాహన ఉన్నా నిర్దిష్టంగా జరిగే మార్పులు ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంటాయి. అయితే ఒకటి మాత్రం స్పష్టం. క్యాపిటలిజాన్ని దాని మానాన దాన్ని వదలివేస్తే విపరీత పర్యావరణ విధ్వంసానికీ, గుత్తాధిపత్యానికీ దారితీస్తుంది. ఏఐ కూడా ఇప్పుడు అదే బాటలో నడుస్తోంది. ఏఐకి ఎంతో కీలకమైన డేటా సెంటర్లు పర్యావరణంపై కలగచేసే ప్రతికూల వాతావరణం గురించి ఇప్పటికే పెద్ద చర్చ మొదలైంది. అమెరికాలోనే వాటిపై వ్యతిరేకత ఆరంభమైంది. కొన్నిచోట్ల స్థానిక ప్రభుత్వాలు వాటి ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేస్తున్నాయి. రిపబ్లికన్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ఇది కనపడుతోంది. ఇక ఏఐతో గుత్తాధిపత్యం మరింతగా పెరిగే అవకాశాన్ని ఏ విధంగానూ కొట్టేయలేం. ఏఐకి సంబంధించిన అయిదు పెద్ద కంపెనీలు ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 240 బిలియన్ డాలర్లను (రూ.23 లక్షల కోట్లు) సేకరించాయి. చరిత్రలో ఒక అయిదు కంపెనీలు స్వల్పకాలంలో ఇంత పెద్ద మొత్తంలో నిధుల సమీకరణ చేయలేదు.

గుత్తాధిపత్యంతో మార్కెట్‌పై అదుపు సంపాదించటానికి ఎంతగా అవకాశం ఉన్నా అది అన్ని సందర్భాల్లోనూ అనుకున్నట్లుగా సాగదు. పెద్ద కంపెనీల మధ్య పోటీని పూర్తిగా నివారించలేం. క్యాపిటలిజంలో ఉన్న మౌలిక లక్షణమే అది. కంపెనీలు గుత్తాధిపత్యంతో సంతృప్తి చెందితే ఐటీ విప్లవం వచ్చేది కాదు. ఈనాటి ఏఐ అభివృద్ధి అయ్యేదీ కాదు. అపరిమిత లాభాపేక్ష కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను సృష్టిస్తుంది. దీనికితోడు కొత్తవి సృష్టించాలనే మనుషుల తపన వల్ల ఏదో ఒక స్థాయిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు ఊపిరిపోసుకుంటూనే ఉంటాయి. గుత్తాధిపత్యం అంటే పెద్ద కంపెనీల మధ్య సమానత్వం ఉన్నట్లు కాదు. వాటి మధ్య ఉన్న అసమానతలు కూడా పోటీకీ, అధిక లాభాన్వేషణకూ దారితీస్తాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానం అనే అస్త్రంతోనే ప్రత్యర్థి కంపెనీలపై పైచేయి సాధించటానికి ప్రయత్నిస్తాయి. అయితే ఈ పోటీ ఏఐ యుగంలో హద్దులు దాటితే సృష్టికర్తల నియంత్రణే జారిపోయే ప్రమాదం ఉంటుంది. అదంటూ జరిగితే ఏ విపరిణామాలు తలెత్తుతాయో ఇప్పటికిప్పుడు ఊహించటం కష్టం. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రముఖ భౌతికశాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ మనుషులు సృష్టించిన ఏఐ మానవ నియంత్రణలో ఉంటుందా? అని 2014లోనే ప్రశ్నించారు. కంప్యూటర్లు, ఇంటర్నెట్ ప్రధానంగా మనం ఇచ్చే ఆదేశాలను అమలుచేసేవనీ, ఏఐ మనుషుల నిర్ణయాలనే ప్రభావితం చేయగలదంటూ యువాల్ నోవా హరారి చేసిన వ్యాఖ్యానంలో నిజం లేకపోలేదు. ఏఐ మీద విపరీతంగా ఆధారపడే మనం సమాచారాన్ని మొత్తం ఏఐ గుప్పిట్లో పెడుతున్నాం. మన భయాలు, కోరికలు, బలహీనతలు, భావోద్వేగాలను అర్థంచేసుకుని మన నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయికి ఏఐ చేరుకుంటోందనీ దీన్ని 'హ్యాకింగ్ హ్యూమన్స్'గా హరారి వ్యాఖ్యానించారు. మనుషులు తమ నిర్ణయాధికారాన్ని ఏఐకి అప్పగించుకుంటూ పోతే క్రమేపీ మేధోపరమైన వివేచనా శక్తులనే కోల్పోతారన్న భయాన్నీ హరారే వ్యక్తంచేశారు. మనుషులతో కాకుండా ఏఐతో ఉద్వేగ సంబంధాలను ఏర్పరచుకుంటే మానవ సామాజిక అస్తిత్వమే బలహీనపడుతుంది. సజీవ మనుషులతో సంబంధాలు సన్నగిల్లితే కళలూ, సాహిత్యాలూ చిన్నబోతాయి. దీంతో మానవ సారమే పలచబడిపోతుంది. మనిషి సజీవతత్వాన్ని తెలుసుకునే మార్గమే మూతపడిపోతుంది.హరారే లాంటి వాళ్లు ఏఐ ప్రమాదాల గురించి చెబుతున్న దానిపై ఎన్నో భేదాభిప్రాయాలు ఉన్నాయి. కానీ ఒక్క విషయం మాత్రం స్పష్టం. ఏఐతో ఉద్యోగాలు పోయి, నాలుగైదు కంపెనీల గుత్తాధిపత్యం పెరిగితే ఆదాయంలోనూ సంపదలోనూ అసమానతలు విపరీతంగా పెరిగిపోతాయి.

ఉద్యోగాలను కోల్పోతే వస్తువులకూ సేవలకూ డిమాండు తగ్గిపోతుంది. ఆర్థిక వ్యవస్థ

## 23 రోజుల్లో 6 వేల మీటర్లకు పైబడిన 20 పర్వత శిఖరాల అధిరోహణ

### చరిత్ర సృష్టించిన నిమాస్ పర్వతారోహక బృందం యాత్రను అభినందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

మొదటిపేజీ తరువాయి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** లద్దాఖ్‌లో ఇప్పటివరకు ఎవరూ అధిరోహించని, ఆరు వేల మీటర్లకు పైగా ఎత్తున్న 20 పర్వత శిఖరాలను కేవలం 23 రోజుల్లో అధిరోహించి చరిత్ర సృష్టించిన 'ఫస్ట్ అసెంట్ మౌంటెనీరింగ్ ఎక్స్‌పెడిషన్' బృందానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం ఘన స్వాగతం పలికారు.

లద్దాఖ్ పర్వత శ్రేణిలోని చామ్సర్--లుంగ్సర్, గ్యామా నాలా, చోకులా ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎవరూ అధిరోహించని 20 శిఖరాలను ఒకే యాత్రలో అధిరోహించడం ఇదే తొలిసారి. దిరాంగ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (నిమాస్)కు చెందిన 20 మంది నైపుణ్యం కలిగిన పర్వతారోహకులు ఈ సాహసయాత్రలో పాల్గొన్నారు. కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్ బృందానికి నాయకత్వం వహించారు.

### పర్వతారోహకుల ధైర్యం ప్రశంసనీయం

యాత్రా బృందంతో మాట్లాడిన రాజ్‌నాథ్ సింగ్, ఈ చారిత్రక విజయాన్ని సాధించడంలో పర్వతారోహకులు ప్రదర్శించిన ధైర్యం, సంకల్పం, పట్టుదలను ప్రశంసించారు. భారత పర్వతారోహణ ప్రతిభకు, సాహస క్రీడల్లో దేశ నాయకత్వానికి ఈ యాత్ర నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ బృంద సభ్యులు యువతకు స్ఫూర్తిదాయకులని ఆయన అభివర్ణించారు. వారి విజయం పర్వతారోహణ రంగంలో నూతన ప్రమాణాలను నెలకొల్పిందన్నారు. దేశవ్యాప్తంగా యువ పర్వతారోహకులు సాహస యాత్రలు, అన్వేషణలవైపు అడుగులు వేసేందుకు ఈ ఘనత ప్రోత్సాహాన్నిస్తుందని చెప్పారు.

### ప్రపంచ పర్వతారోహణ పటంలో భారత్‌కు ప్రత్యేక స్థానం

ఈ యాత్రలో అసాధారణ ప్రణాళిక, సాంకేతిక నైపుణ్యం, శారీరక దృఢత్వం, సమష్టి కృషి స్పష్టంగా కనిపించాయని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో పర్వతారోహణ చేయగల భారత్ సామర్థ్యాన్ని ఈ యాత్ర ప్రపంచానికి చాటిందని పేర్కొంది.

సరిహద్దుల్లో సాహసం, అన్వేషణ స్ఫూర్తిని ప్రోత్సహించడంతోపాటు భవిష్యత్తు తరాల పర్వతారోహకులకు ప్రేరణ కల్పించాలనే ఉద్దేశంతో ఈ యాత్రను నిర్వహించారు.

న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్--2లో జరిగిన స్వాగత కార్యక్రమంలో రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్‌తోపాటు రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సమర్థవంతమైన అటవీ నిర్వహణకు సామర్థ్య పెంపు ప్రాజెక్టు వర్క్‌షాప్ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

2025--26 నుంచి 2031--32 వరకు అమలు చేయనున్న ఈ సామర్థ్య పెంపు ప్రాజెక్టు ద్వారా మారుతున్న అటవీ, వన్యప్రాణుల నిర్వహణ అవసరాలకు అనుగుణంగా క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది సామర్థ్యాలను మెరుగుపరచనున్నారు. వాతావరణ, పర్యావరణ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది నిర్వహిస్తున్న విభిన్న బాధ్యతలకు తగిన శిక్షణ అందించడం కూడా ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.

పరిశోధన, అభివృద్ధి వ్యవస్థలను బలోపేతం చేయడంతోపాటు శాస్త్రీయ అధ్యయనాల ఫలితాలను మెరుగైన శిక్షణ కార్యక్రమాలు, సుస్థిర అటవీ నిర్వహణ పద్ధతులుగా మార్చేందుకు ప్రాజెక్టు దోహదపడనుంది.

వర్క్‌షాప్ ప్రారంభ సమావేశంలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ అటవీ రంగంలో భారత్--జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సహకారంలో ఈ ప్రాజెక్టు ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, అడవులపై ఆధారపడి జీవిస్తున్న ప్రజల జీవనోపాధికి మద్దతు అందించడంలో అటవీ సంపద కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది కార్యనిర్వహణ, పరిపాలన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రాంతాలవారీ పరిస్థితులకు అనుగుణంగా స్థానిక పరిజ్ఞానం, సవాళ్లను ప్రతిబింబించే సామర్థ్య పెంపు శిక్షణ మాడ్యూళ్లను రూపొందించాలని సూచించారు. తాజా శాస్త్రీయ విధానాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల ఆధారంగా ఆచరణాత్మక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

అటవీ అగ్నిప్రమాదాల నిర్వహణ ప్రపంచవ్యాప్తంగా ప్రధాన సవాలుగా మారిందని భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణ, జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పులపై చర్యల విషయంలో సాంకేతిక, క్షేత్రస్థాయి సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ ప్రాజెక్టులో విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు.

సామర్థ్య పెంపు కార్యక్రమాలు తరగతి గది శిక్షణకే పరిమితం కాకూడదని మంత్రి స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతలు, క్షేత్రస్థాయిలో ఉత్తమ విధానాల అమలుపై ప్రధానంగా దృష్టి సారించడంతోపాటు స్థానిక సమాజాల పరిజ్ఞానం, అనుభవాలను కూడా సమీకరించాలని సూచించారు.

## 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు: అమిత్ షా

మొదటిపేజీ తరువాయి

నోయిడా: ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో దాయాది పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు.

ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమై ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. యూపీలో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.

## గొట్టా బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

హీరమండలం: వంశధార నదిపై నిర్మించిన గొట్టా బ్యారేజ్ వద్ద వరద ప్రవాహం పెరగడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసి సైరన్ మోగించారు. బ్యారేజ్ పూర్తి నీటి మట్టం 0.6619 టీఎమ్‌సీలుగా కాగా.. ప్రస్తుత నీటి మట్టం 0.2404 టీఎమ్‌సీలుగా ఉంది. 4 గేట్లను 60 సెం.మీ, 15 గేట్లను 80 సెం.మీ మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నది దిగువకు 40,079 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, ఇన్ ఫ్లో 36,690 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 40,079 క్యూసెక్కులుగా నమోదైంది. ఎడమ, కుడి కాలువలు మూసివేసి ఉంచారు. వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో వంశధార పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## బాలాపూర్ లడ్డూకు రికార్డు ధర

మొదటిపేజీ తరువాయి

భగవంతుడు సుఖసంతోషాలను అందించారనే నమ్మకంతో మరుసటి ఏడాదితో పాటు 1998, 2004, 2008లలోనూ ఆయన పోటీ పడి దక్కించుకున్నారు. లడ్డూ వేలంలో పాల్గొనేందుకు 15 ఏళ్ల పాటు స్థానికులకే అవకాశం కల్పించిన ఉత్సవ సమితి.. ఆ తర్వాత బయట వ్యక్తులనూ అనుమతించింది. అలా 2009లో సరిత అనే మహిళ రూ.5.10 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు 31 సార్లు వేలం వేయగా.. 2020లో కరోనా నేపథ్యంలో వేలం వేయకుండా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేశారు. 2024లో కొలను శంకర్‌రెడ్డి రూ.30.01లక్షలకు, గతేడాది లింగాల దశరథ్‌గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకున్నారు.

## వ్యవసాయ రంగంలో సీఎస్ఆర్ సహకారానికి పరిశ్రమలతో ఐకార్ భాగస్వామ్యాలను సులభతరం చేసిన అగ్రిఇన్నోవేట్ ఇండియా

మొదటిపేజీ తరువాయి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ 15వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం), 71వ బోర్డు సమావేశం సెప్టెంబరు 24న న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈ సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్), మూడు పారిశ్రామిక సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి.

పిడిలైట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎవరెస్ట్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ఐకార్ కుదుర్చుకున్న ఈ అవగాహన ఒప్పందాలకు అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ సహకారం అందించింది.

వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రజలకు ప్రయోజనం కలిగించే కార్యక్రమాల అమలుకు పారిశ్రామిక సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను వినియోగించుకోవడం ఈ భాగస్వామ్యాల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐకార్ డైరెక్టర్ జనరల్, అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ ఎం.ఎల్. జాట్, ఐకార్ కార్యదర్శి, అగ్రిఇన్నోవేట్ వైస్ చైర్మన్ జ్ఞానేంద్ర త్రిపాఠి, ఐకార్ ఆర్థిక సలహాదారు సందీప్ సర్కార్, అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ సీఈఓ డాక్టర్ ప్రవీణ్ మాలిక్, సంస్థ బోర్డు సభ్యులు, అగ్రిఇన్నోవేట్ బృందం, ఐకార్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఈ భాగస్వామ్యాల ద్వారా సుస్థిర వ్యవసాయ--ఆహార వ్యవస్థలు, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, సహజ వనరుల నిర్వహణ, జీవనోపాధుల మెరుగుదల, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, మహిళలు--యువత సాధికారత వంటి ప్రాధాన్య రంగాల్లో కార్యక్రమాలు చేపట్టనున్నారు.

వ్యవసాయ స్టార్టప్‌లు, ఇంక్యుబేషన్, గ్రామీణ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం, డిజిటల్ ఆవిష్కరణలు, సామర్థ్య వికాసం, పోషకాహార ఆధారిత వ్యవసాయం, బయోఫోర్టిఫికేషన్, ఆహార శుద్ధి, విలువ ఆధారిత సరఫరా వ్యవస్థల అభివృద్ధి, వ్యవసాయ యాంత్రీకరణ, విద్య--విజ్ఞాన భాగస్వామ్యాలు, 'వన్ హెల్త్'తోపాటు పరస్పరం అంగీకరించిన ఇతర రంగాల్లోనూ కలిసి పనిచేయనున్నారు.

భారత వ్యవసాయ పరిశోధనా మండలికి చెందిన అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ వ్యవసాయ వ్యాపారం, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వాణిజ్యీకరణతోపాటు సీఎస్ఆర్ నిధుల సమీకరణ విభాగంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

### ఆరు దేశాల రాయబారుల నుంచి ఆధారపత్రాలు స్వీకరించిన

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మొదటిపేజీ తరువాయి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** ఫిన్లాండ్, వియత్నాం, మెక్సికో, ఎస్టోనియా, యూరోపియన్ యూనియన్, బెల్జియం దేశాలకు చెందిన రాయబారులు తమ నియామక ఆధారపత్రాలను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించారు. రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి వారి ఆధారపత్రాలను స్వీకరించారు.

ఆధారపత్రాలు సమర్పించిన రాయబారులు:

1. మిక్కో కివికోస్కి --- ఫిన్లాండ్ రాయబారి
2. త్రిన్హ్ మిన్ మాన్ --- సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం రాయబారి
3. పెడ్రో బ్లాంకో పెరెజ్ --- మెక్సికో రాయబారి
4. క్రిస్టి కరెల్సోన్ --- రిపబ్లిక్ ఆఫ్ ఎస్టోనియా రాయబారి
5. జీన్-ఎరిక్ పాకెట్ --- యూరోపియన్ యూనియన్ రాయబారి
6. సోఫీ కార్ల్‌షాసెన్ --- బెల్జియం రాజ్య రాయబారి

ఈ కార్యక్రమం రాష్ట్రపతి భవన్‌లో అధికారికంగా జరిగింది.

## దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు.. పలుచోట్ల జలఫిరంగుల ప్రయోగం



దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష కాంగ్రెస్ (జశీఅస్త్రతీవం) దేశవ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు చేపట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నేతలు నినాదాలు చేశారు. ఈ క్రమంలో దిల్లీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బారికేడ్లను తొలగించుకొని ఎన్నికల కమిషన్ కార్యాలయం వైపు దూసుకెళ్లారు. పోలీసులు వారిని అడ్డుకొని నిర్బంధించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ప్రజాస్వామ్యం నాశనమవుతుంటే చూస్తూ కూర్చోబోమని దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ అన్నారు. అంతకుముందు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రూపంలో ఉన్న మాస్కులను ధరించి.. యూత్ కాంగ్రెస్ నేతలు దిల్లీలో ఆందోళన చేపట్టారు. ఆందోళనల నేపథ్యంలో అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్‌ను పోలీసులు నిర్బంధించారు. బిహార్ రాజధాని పట్నా, చండీగఢ్‌లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు జలఫిరంగులు ప్రయోగించారు. ఇదే తరహా ఆందోళనలు కోల్‌కతా, జమ్మూ తదితర ప్రాంతాల్లోనూ జరిగాయి.

సందేశం టైమ్స్

26-09-2026

# వివిధ గణేష్ మండపాల్లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్

## రావుకోమటూర్ చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి :** మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుశుక్రవారంనియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గణేష్ మండపాలవద్దనిర్వాహకులు, భక్తులతో ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్ననిర్వాహకులను అభినందించారు. ప్రజలకుశాంతి,సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని వినాయకుడిని ప్రార్థించారు. అనంతరం ఎమ్మెల్యే రోహిత్ రావు కోమటూర్ చెరువు వద్దకు చేరుకుని వినాయక నిమజ్జన కార్యక్రమాల కోసం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి



ఇబ్బందులు కలగకుండా అధికారులు, నిర్వాహకులు చేపట్టిన ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన ప్రాంతంలో భక్తుల రాకపోకలు, జనసందోహం నియంత్రణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు, నిమజ్జన ప్రాంతం వద్ద అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయసంఘటనలకుతావులేకుండా జరిగేలా అధికారులు,ఉత్సవకమిటీనిర్వాహకులువాలంటీర్లుసమన్వయంతోపనిచేయాలనిసూచించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిమజ్జన ప్రాంతంలో పరిశుభ్రతను కాపాడాలని పేర్కొన్నారు. ప్రజలు, భక్తులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ శాంతియుతవాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలనునిర్వహించాలని ఎమ్మెల్యే రోహిత్ రావుఆకాంక్షించారుఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా గ్రామాల్లో పకడ్బందీ ప్రణాళిక

**వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికను సమగ్రంగా రూపొందించాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్, సెప్టెంబర్ 26:**సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: ఎల్‌నినోతో పాటు మారుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావాలను ఎదుర్కొనేలా గ్రామాల్లో నీటి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పకడ్బందీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. వీబీ జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ (ఎ+రా) తయారీపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, వాటికి ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించి, వచ్చే ఐదేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ఎ+రా రూపొందించాలని సూచించారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న వనరులు, ప్రజల అవసరాలు, అభివృద్ధి అవకాశాలను గుర్తించడంతో పాటు భవిష్యత్‌లో ఎదురయ్యే వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రణాళికలను అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రవేశపెట్టి ప్రజల ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామసభల్లో ప్రజలందరూ పాల్గొనేలా చూడాలని, వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టాల్సిన పనులను గుర్తించి సాంకేతిక సూచనలు అందించడంతో పాటు ప్రతిపాదనలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల్లో కూలీల (వేజ్ సీకర్స్) సంఖ్యను పెంచి, ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని కోరారు. వీబీ జీ రామ్ జీ కార్యక్రమం ద్వారా మొత్తం 22 విభాగాలకు సంబంధించిన 318 రకాల పనులను గ్రామాల్లో చేపట్టే అవకాశం ఉందని, ప్రతి గ్రామానికి అత్యవసరంగా



అవసరమైన పనులను గుర్తించి ఎ+రాలో చేర్చాలని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రాధాన్యతా క్రమంలో పనులను ఎంపిక చేసి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తే గ్రామాల అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జెడ్పీ సీఈవో ఎల్లయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కోమట్లగూడెంలో ఘనంగా సిద్ధి వినాయక అన్నదానం.

**సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇంచార్జ్ శెట్టి సురేష్:చింతకాని, సెప్టెంబర్ 25 (న్యూస్):** చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామంలో సిద్ధి వినాయక స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చింతకాని ఎస్ఐ జి. నరేష్, ఏఎస్ఐ లక్ష్మణ్ చౌదరి, గ్రామ సర్పంచ్ కొండూరు పరిశుద్ధరావు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ



సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ పండుగలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ పరిశుద్ధరావు మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, మహిళలు, యువతతో పాటు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడంతో కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిసింది.

# రిపోర్టర్ సత్యానందం కుటుంబానికి చింతకాని మండల ప్రెస్ క్లబ్ చేయూత

**రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సహాయం**



**సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇంచార్జ్ శెట్టి** సురేష్:చింతకాని: బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన రిపోర్టర్ మందా సత్యానందం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జర్నలిస్టుగా సమాజానికి విశేష సేవలందిస్తూ, ప్రజా సమస్యలు, అన్యాయాలను వెలుగులోకి తీసుకురావడంలో తనదైన పాత్ర పోషించిన సత్యానందం మృతి పట్ల చింతకాని మండల ప్రెస్ క్లబ్ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యానందం కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ చింతకాని మండల ప్రెస్ క్లబ్ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు అధ్యక్షులు జొన్నలగడ్డ మల్లీశ్వరి, సెక్రటరీ వెన్న బోయిన సురేందర్, అంబటి శాంతయ్య,గుడిద పిచ్చయ్య, సురేష్ శెట్టి, గడ్డం విజయ్, గండారపు రామారావు, వేర్పుల కోటేశ్వరరావు, గంటల తిరుపతాచారి చాపలమడుగు వీరబాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బోనకల్ మండల ప్రెస్ క్లబ్ సభ్యులు తేనె వెంకటేశ్వర్లు, షేక్ బడే సాహెబ్, దేగల యాలాద్రి గ్రామ సర్పంచ్ మంద కరుణ, ఏసుపోగు బాబు, ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య గ్రామ సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది

# నూకల నరేందర్ రెడ్డిని పరామర్శించిన తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ సాముల రామిరెడ్డి

**సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి / సెప్టెంబర్ / 26/**



సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ కు చెందిన నూకల నరేందర్ రెడ్డి గారి సతీమణి నూకల జానకి గారు సెప్టెంబర్ 15న మరణించారు. నూకల జానకి గారి దశదిన కార్యక్రమం ఈరోజు అనగా సెప్టెంబర్ 25న శుక్రవారం హుజూర్నగర్ లో జరిగింది. ఈ సందర్భంగా నూకల జానకి గారి దశ దిన కార్యక్రమానికి హాజరై జానకి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ సాముల రాంరెడ్డి తదితరులు. తదుపరి జానకి గారి భర్త నూకల నరేందర్ రెడ్డినీ, జానకి గారి కుమారుడు నూకల సాహిత్ రెడ్డి లతోపాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ సాముల రామిరెడ్డి గారు ఓదార్చడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టి యు డబ్ల్యూ జే, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు, సీనియర్ జర్నలిస్టులు పులుసు నాగరాజు, షేక్ రషీద్, రెబ్బ విజయ్ కుమార్, జహీర్, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడికుందలో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**మేడికుందలో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**




**వట్పల్లి, సెప్టెంబర్ 26 సందేశం టైమ్స్ ప్రతినిధి:** వట్పల్లి మండలం మేడికుంద గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్త డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చంద్రకళ లబ్ధిదారులకు రేషన్ కార్డులను చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రకళ మాట్లాడుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సన్నబియ్యం ద్వారా పిల్లలు, పెద్దలు కడుపునిండా భోజనం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఆహార భద్రత కార్డు ద్వారా పలు సంక్షేమ పథకాలకు లబ్ధి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, గ్రామ కార్యదర్శి చరణ్ రాజ్, ఉపసర్పంచ్ నిర్మల నాగయ్య, వార్డు సభ్యులు పోచయ్య, విష్ణు, సురేష్, ప్రేమల, స్వరూప, ప్రభు, డీలర్ ఏర్పుల బేతయ్య, నాయకులు బగిలి వీరప్ప, ప్రవీణ్ గౌడ్, బక్కన్న, శ్రీశైలం, పల్లె కృష్ణ, విట్టల్, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి

**-- కాంగ్రెస్ నాయకులు మొరబోయిన క్రిష్ణ**

**-- వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన క్రిష్ణ దంపతులు**

**అందోలు, సెప్టెంబర్ 25: సందేశం టైమ్స్ ప్రతినిధి:**



గణపయ్య ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండి పాడిపంటలు సమృద్ధిగా పండడంతో పాటు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరబోయిన క్రిష్ణ ఆకాంక్షించారు. అందోలు మండల పరిధిలోని కన్సాన్‌పల్లి గ్రామంలోని ఈశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో క్రిష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు ఆనంద్ శర్మ సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా క్రిష్ణ మాట్లాడుతూ ఐక్యత, భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉత్సవ కార్యక్రమాలు విజయవంతంగా ముగిసేలా గణపయ్య ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు.

**36 రకాల నైవేద్యాల సమర్పణ**

వినాయక ఉత్సవాల్లో భాగంగా గణనాథుడికి నిర్వహించిన మహా ప్రసాద మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామానికి చెందిన మహిళా భక్తులు గణేశుడికి ఇష్టమైన వివిధ రకాల నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఒకటి, రెండు కాదు ఏకంగా 36 రకాల పిండివంటలు, పండ్లు, ఫలహారాలతో మహాప్రసాదాన్ని సిద్ధం చేసి స్వామివారి సన్నిధిలో సమర్పించారు. పులిహోర, పొంగలి, గారెలు, పాయసం, అరిసెలు, బూంది, బాదుషా, కాజాలు తదితర వంటకాలతో మహా నైవేద్యాన్ని ఏర్పాటు చేయడం భక్తులను ఆకట్టుకుంది.

# చింతకాని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయకుని పూజ

**సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్:**



చింతకాని, సెప్టెంబర్ 25: వినాయక చవితి సందర్భంగా చింతకాని ప్రెస్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి పూజలు చేసి, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జొన్నలగడ్డ మల్లీశ్వరి, అంబటి శాంతయ్య, గుడిద పిచ్చయ్య, సురేష్ శెట్టి, గడ్డం విజయ్, గండారపు రామారావు, వేర్పుల కోటేశ్వరరావు, వెన్నబోయిన సురేందర్, గంటల తిరుపతాచారి, చాపలమడుగు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
నిజం దాగదు - వార్త ఆగదు
26-09-2026

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ అవగాహన దినోత్సవం

సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్:సెప్టెంబర్ 26, నాగులవంచ, సెప్టెంబర్ 24:



జాతీయ సేవా పథకం ( ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాల నాగులవంచలో సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ అవగాహన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ పి. నవీన్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయా మాట్లాడుతూ, మహాత్మా గాంధీ శతజయంతిని పురస్కరించుకుని 1969లో జాతీయ సేవా పథకం ( ఎన్ఎస్ఎస్) ప్రారంభించబడిందని తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. మల్లయ్య మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. "నాట్ మీ బట్ యూ" అనే ఎన్ఎస్ఎస్ నినాదానికి అనుగుణంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆయూబ్, కృష్ణవేణి, ముప్పి విజయ్, వెంకట్ రెడ్డి, రాజాబాబు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, నాగేశ్వర్, వేణు, చరణ్ తదితరులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈరోజు మెదక్ పట్టణం, వెస్లీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో



సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి:
జిల్లా స్థాయి 14 మరియు 17 సంవత్సరాల లోపు బాలుర కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. అన్ని మండలాల నుండి 42 జట్లు 550 మంది బాలికలు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన 14సంవత్సరాల లోపు బాలుర నుండి12 మంది 17 సంవత్సరాల లోపు బాలుర నుండి 12 మంది మొత్తం24మందిక్రీడాకారులతో కూడిన మెదక్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. ముగింపు కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ కార్యదర్శి ఆర్ నాగరాజు పీడీల అందరితో క్రీడాకారులకుబహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ నాగరాజు ూజుూూ యూ తెలంగాణ కార్యనిర్వాహక అధ్యక్షులు, ూజుూూ యూ జిల్లాకార్యదర్శిమధుసూదన్, ూజుూూ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, పి డీ లు మాధవరెడ్డి, రమేష్, శేఖర్, నరేష్, సిద్ధి రాములు, శ్యామ్, రూపేందర్ పాల్గొన్నారు.17 సంవత్సరాల లోపుబాలికల విజేతలు 1.కౌడిపల్లి మండలం 2.టేక్మాల్ మండలం3.అల్లాదుర్గ్ మండలం 14 సంవత్సరాల లోపు బాలికలు విజేతలు1.కౌడిపల్లి మండలం 2 పెద్ద శంకరంపేట్ మండలం 3.మెదక్ మండలం

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు



మెదక్ సెప్టెంబర్ 26: సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి:
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,మెదక్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికల ప్రక్రియలోభాగంగాస్వీకరించిన23నామినేషన్లనుఈరోజు(25.09.2026)పరిశీలించినట్లు ఎన్నికల అధికారి, మెదక్ ఆర్డీవో డా. కె. రమాదేవి తెలిపారు.నామినేషన్ల పరిశీలన అనంతరం 22 నామినేషన్లు ఆమోదించగా,1నామినేషన్తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు.నామినేషన్ల ఉపసంహరణకు రేపు (26.09.2026) ఉదయం 10 గం.ల నుండి ఒంటి గంట వరకు అవకాశం కల్పించడంతో పాటు, అదే రోజు తుది నామినేషన్ల జాబితాను ప్రచురించనున్నారు.మెదక్ జిల్లా శాఖ మేనేజింగ్కమిటీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్04.10.2026న నిర్వహించనున్నారు.ఎన్నికల ప్రక్రియను సంబంధిత నిబంధనలప్రకారంపారదర్శకంగా,క్రమబద్ధంగానిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఎన్నికల అధికారి డా. కె. రమాదేవి తెలిపారు.

# బాన్సువాడలో గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు..

-200 మంది పోలీసులతో భద్రత..
-100 సీసీ కెమెరాలు, 2 డ్రోన్లతో నిఘా
- డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు: ఎస్పీ రాజేష్ చంద్ర

సందేశం టైమ్స్
బాన్సువాడ పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ తెలిపారు. భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.నిమజ్జన శోభాయాత్ర కోసం బాన్సువాడ పట్టణాన్ని 3 సెక్టర్లుగా విభజించి, 10 పికెట్లు, 7 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించారు. శోభాయాత్ర మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, నిమజ్జన ప్రాంతాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.శోభాయాత్రను సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించేందుకు సుమారు 100 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సీఐల పర్యవేక్షణలో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను సిద్ధంగా ఉంచారు.గణేష్ నిమజ్జన శోభాయాత్రలో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు.నిమజ్జన ప్రాంతాల్లో పిల్లలు, ఈత రాని వారు నీటిలోకి దిగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.



మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా, అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే డయల్ 112కు లేదా సమీప పోలీసులకు సమాచారం అందించాలని కోరారు."భక్తి మనసులో ఉండాలి.. బాధ్యత మన చేతుల్లో ఉండాలి" అనే సందేశంతో ప్రజలు పోలీసు శాఖకు సహకరించి గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర విజ్ఞప్తి చేశారు.

# ప్రమాదకరంగా పనిచేస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు

- వర్క్ జోన్ సైన్ బోర్డులు లేకుండానే పనులు..

సందేశం టైమ్స్
మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో మెదక్--ఎల్కతుర్తి 765 జాతీయ రహదారి డివైడర్లపై పెరిగిన పిచ్చిమొక్కలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తొలగిస్తున్నారు. వాస్తవానికి ఈ పనులను జాతీయ రహదారి అధికారులు తమ సిబ్బందితో చేపట్టాల్సి ఉండగా, పనులు ఆలస్యం కావడంతో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు పంచాయతీ అధికారులు కార్మికులతో మొక్కలను తొలగిస్తున్నారు.అయితే కార్మికులు పనిచేస్తున్న ప్రాంతంలో ఎలాంటి బారికేడ్లు, హెచ్చరికలు లేదా వర్క్ జోన్ సైన్ బోర్డులు ఏర్పాటు



చేయకపోవడంతో ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. కార్మికుల పక్క నుంచే వాహనాలు వేగంగా వెళ్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల భద్రత దృష్ట్యా పనులు జరిగే ప్రాంతంలో తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సరితను వివరణ కోరగా.. జాతీయ రహదారి అధికారులు ప్రస్తుతం నందిగామ వరకు మాత్రమే పనులు చేపట్టారని, నిజాంపేట వరకు రావడానికి మరో 15--20 రోజులు సమయం పట్టే అవకాశం ఉందన్నారు. వాహనదారులకు రహదారిపై పిచ్చిమొక్కల కారణంగా ఇబ్బంది ఏర్పడుతోందని కొందరు గ్రామస్థులు చెప్పడంతో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో మొక్కలను తొలగించే పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతంలో ప్రమాదం ఉంటే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

# 16 ఏళ్ల కల సాకారం హన్మాజీపేట్‌కు 24 గంటల విద్యుత్..

-సర్పంచ్ లావణ్య వెంకగౌడ్ ప్రత్యేక కృషి

సందేశం టైమ్స్
గ్రామ ప్రజలు 16 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నేటితో సాకారమైంది. హన్మాజీపేట్ గ్రామానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సర్పంచ్ లావణ్య వెంకగౌడ్ ప్రత్యేకంగా కృషి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ సమస్య పరిష్కారానికి సర్పంచ్ చేసిన కృషి ఫలించింది.



దీంతో గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరపున ఎలక్ట్రికల్ డీఈ వినోద్ కుమార్, బాన్సువాడ రూరల్ ఏఈ అనిల్ కుమార్‌లను ఘనంగా సన్మానించారు.16 ఏళ ్లగా కొనసాగుతున్న సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ సర్పంచ్ లావణ్య వెంకగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో విద్య, వ్యవసాయం, తాగునీటి సరఫరా తదితర రంగాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోనాల సుభాష్, బోనాల సాయిలు, నాయకులు ప్రవీణ్ గౌడ్, భాను గౌడ్, రంగారి సంజీవ్, లైన్‌మెన్ రమేష్, వార్డు సభ్యులు వడ్ల భాగయ్య, పోతరాజ్ తుకారాం, గ్రామ పెద్దలు పోతరాజ్ లింగం, తలర్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క సమీక్షా సమావేశం..

- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సందేశం టైమ్స్
ఈ నెల 28వ తేదీ సోమవారం కామారెడ్డి వేదికగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నిర్వహించనున్న సమీక్షా సమావేశం ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు.ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన అధికారులతో జరిగే ఈ సమావేశానికి వేదిక ఏర్పాట్లు, శాఖల వారీగా నివేదికల సిద్ధం, ఇతర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు, వాటి పురోగతి, పెండింగ్ అంశాలు, సాధించిన లక్ష్యాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.మంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి సమావేశాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. మంత్రి పర్యటన కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రూమ్ నంబర్ 25కు మార్చినట్లు అధికారులు తెలిపారు.సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జెడ్పీ సీఈఓ చందర్, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, డీఆర్‌ఓ పాండు, ఏఓ మసూద్ హైమద్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వందేమాతరం గీతం..

**-కామారెడ్డిలో ఘనంగా సామూహిక గేయాలాపన**

సందేశం టైమ్స్





వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో 'నమామి భారతం-వందేమాతరం' కార్యక్రమాన్ని కామారెడ్డి పట్టణంలో శు క్రవారం ఘనంగా నిర్వహించారు.కామారెడ్డిలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ హైస్కూల్‌తో పాటు సర్దార్ పటేల్ విగ్రహం, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, శివాజీ విగ్రహం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జయప్రకాశ్ నారాయణ విగ్రహం (జేపీఎన్), శ్రీ సరస్వతీ శిశు మందిర్ భగత్‌సింగ్ నగర్, కేజీబీవీ టేక్రియాల్, రెడ్డిపేట పాఠశాలల్లో ఉదయం 11 గంటలకు సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు.
ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌సుందర్‌రావు మాట్లాడుతూ వందేమాతరం గేయం భారతీయుల్లో జాతీయ చైతన్యాన్ని, దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ గీతం స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు.

# 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వందేమాతరం గీతం..

**-కామారెడ్డిలో ఘనంగా సామూహిక గేయాలాపన**

సందేశం టైమ్స్



వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో 'నమామి భారతం--వందేమాతరం' కార్యక్రమాన్ని కామారెడ్డి పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.కామారెడ్డిలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ హైస్కూల్‌తో పాటు సర్దార్ పటేల్ విగ్రహం, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, శివాజీ విగ్రహం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జయప్రకాశ్ నారాయణ విగ్రహం (జేపీఎన్), శ్రీ సరస్వతీ శిశు మందిర్ భగత్‌సింగ్ నగర్, కేజీబీవీ టేక్రియాల్, రెడ్డిపేట పాఠశాలల్లో ఉదయం 11 గంటలకు సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌సుందర్‌రావు మాట్లాడుతూ వందేమాతరం గేయం భారతీయుల్లో జాతీయ చైతన్యాన్ని, దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ గీతం స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు..

సందేశం టైమ్స్




ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కామారెడ్డి 14వ వార్డు కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత పేర్కొన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వించేలా రాణించి, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.
పాఠశాలలోని 140 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజిత, శైలజ, గీత, నీరజ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మా గంగమ్మా... నీ ఒడిలోకి వస్తున్నాను!

**-ఒక గణపతి ఆత్మకథ**

**భక్తితో పిలిచారు... డీజేలతో భయపెట్టారు! కోట్ల ఖర్చు చేశారు... కానీ నా మాట విన్నారా?**

సందేశం టైమ్స్

"అమ్మా గంగమ్మా... వస్తున్నానమ్మా!నీ ఒడిలోకి వస్తున్నాను.నేను గణపతిని... విఘ్నాలను తొలగించేవాడిని.కానీ ఈసారి భూలోకంలో నేను చూసిన కొన్ని దృశ్యాలు నా మనసునే కలచివేశాయమ్మా!"ఏడాది తర్వాత మళ్లీ భూలోకానికి వచ్చాను. ప్రతి ఇంటా పూజలు... ప్రతి గల్లీలో మండపాలు... పిల్లల కేరింతలు... మహిళల హారతులు... భక్తుల ప్రార్థనలు. నన్ను ఎంత ప్రేమగా ఆహ్వానించారో చూసి ఆనందించాను.కానీ రోజులు గడుస్తున్న కొద్దీ ఆ ఆనందం మధ్యలో నాకు మరో ప్రపంచం కనిపించిందమ్మా!డీజే నిశ్శబ్దపు మృత్యువు!"అమ్మా... నా ముందు భక్తితో నాట్యం చేయండి. ఆనందించండి. నాకు సంతోషమే. కానీ చెవులు దద్దరిల్లే డీజే శబ్దం ఎందుకమ్మా?ఆ శబ్దానికి చిన్నారులు ఉలిక్కిపడుతున్నారు. వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. రోగులు తట్టుకోలేకపోతున్నారు. యువకులు గంటల తరబడి భారీ శబ్దం మధ్య నృత్యాలు చేస్తున్నారు.నా పేరు మీద జరిగే పండుగలో ఒక మనిషి ప్రాణానికైనా ముప్పు వస్తే... అది నాకు పూజ ఎలా అవుతుందమ్మా?నాకు డీజేలు వద్దని నేను ఎప్పుడూ చెప్పలేదు. ఆనందాన్ని వద్దనలేదు. కానీ ఆనందానికి హద్దు ఉండాలి. మీ సంబరం మరొకరి బాధ కాకూడదు!"భక్తితో ప్రారంభించి... విధ్వంసంతో ముగించొద్దు!ఒకప్పుడు వినాయక చవితి వస్తే ఇంటిల్లిపాది కలిసి మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించేవారు. పత్రి తెచ్చేవారు. ఉండ్రాళ్లు, కుడుములు చేసి నైవేద్యం పెట్టేవారు. పిల్లలకు కథలు చెప్పేవారు.ఇప్పుడు కొన్ని చోట్ల ఎవరి విగ్రహం పెద్దది? ఎవరి మండపం గొప్పది? ఎవరి డీజే ఎక్కువ శబ్దం చేస్తుంది? ఎవరు ఎక్కువ ఖర్చు చేశారు? అనే పోటీ పెరుగుతోంది."అమ్మా... నా ఎత్తు పెరిగింది. మండపాల ఆర్భాటం పెరిగింది. ఖర్చు పెరిగింది. కానీ మనిషిలోని భక్తి కూడా అదే స్థాయిలో పెరిగిందా?" అని గణపతి ప్రశ్నిస్తున్నట్టుంది.లడ్డూ వేలం... లక్షల్లో!వినాయక ఉత్సవాల్లో లడ్డూ వేలం ప్రత్యేక ఆకర్షణగా మారింది. బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం చిన్న మొత్తంతో మొదలై నేడు లక్షల రూపాయలకు చేరింది. 2026లో బాలాపూర్ లడ్డూ రూ.39 లక్షలకు వేలంలో దక్కినట్లు సమాచారం."నా ప్రసాదానికి మీరు లక్షలు వెచ్చిస్తున్నారు... అది మీ విశ్వాసం. కానీ అదే భక్తిలో కొంత భాగం ఆకలితో ఉన్నవాడికి అన్నంగా, చదువుకోలేని చిన్నారికి పుస్తకంగా, వైద్యం అందని పేదవాడికి మందుగా మారితే... నేను మరింత ఆనందించనూ?"తిలక్ ఆశయం గుర్తుందా?"ఒకప్పుడు బాల గంగాధర్ తిలక్ నా పండుగను ప్రజలను ఒక్కచోట చేర్చే సామాజిక వేదికగా మలిచారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రజల్లో ఐక్యత, చైతన్యం పెంచేందుకు గణేష్ ఉత్సవాలను ఉపయోగించారు.మరి నేడు నా పండుగ మనుషులను కలపాలి గానీ... శబ్దం, పోటీ, ఆర్భాటంతో విడదీయకూడదు కదమ్మా!"అమ్మా... ఇక నీ ఒడిలోకి




వస్తున్నాను!వరకు నిమజ్జనానికి బయలుదేరాడు.డప్పుల చప్పుళ్లు... భక్తుల నృత్యాలు..."గణపతి బప్పా మోరియా" నినాదాలు...ఆ సందడిలో గణపతి మాత్రం మౌనంగా గంగమ్మతో మాట్లాడుతున్నట్టుంది."అమ్మా గంగమ్మా... భూలోకంలో ఆనందాన్ని చూశాను. ఆర్భాటాన్నీ చూశాను. భక్తిని చూశాను... బాధను కూడా చూశాను.ఇక నీ ఒడిలోకి వస్తున్నాను.వచ్చే ఏడాది మళ్లీ వస్తాను. అప్పుడు నాకు ఇంకా ఎత్తైన విగ్రహం అవసరం లేదమ్మా... ఇంకా పెద్ద డీజే అవసరం లేదు... ఇంకా ఎక్కువ ఖర్చు అవసరం లేదు.ప్రకృతిని కాపాడండి.ప్రాణాలను కాపాడండి.పేదవాడి కన్నీరు తుడవండి.పక్క మనిషికి ఇబ్బంది కలిగించకుండా పండుగ చేసుకోండి.
అదే నాకు నిజమైన పూజ.భక్తికి శబ్దం కొలమానం కాదు అమ్మా...మనసే కొలమానం

# వరంగల్ జిల్లా బాలుర జూనియర్ కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తులు అందించిన డా.పుల్లూరి శ్రీనివాస్ గౌడ్

**- వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డా.పుల్లూరి శ్రీనివాస్ గౌడ్**

సందేశం టైమ్స్

వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా సైనిక్ స్కూల్ అశోక్ నగర్ లో కొనసాగుతున్న జూనియర్ బాలుర కబడ్డీ శిక్షణ శిబిరంలో వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్సార్ యూనివర్సిటీ వరంగల్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ విచ్చేసి వరంగల్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తూ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర కబడ్డీ పోటీల్లో పాల్గొనే వరంగల్ జిల్లా బాలుర కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తులు అందించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వరంగల్ జిల్లా జట్టు విజయం సాధించాలని క్రీడాకారులు క్రమశిక్షణతో తమ నైపుణ్యాలను కనబరిచి తెలంగాణ రాష్ట్రం నుండి జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాలని, క్రీడాకారుల అభివృద్ధికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని, కబడ్డీ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ మాట్లాడుతూ కబడ్డీ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని వరంగల్ జిల్లాకు పేరు ప్రఖ్యాతలు వచ్చే విధంగా కృషి చేయాలని వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ నుండి క్రీడాకారులను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ యొక్క కార్యక్రమ ప్రత్యేక అతిథులు సైనిక్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ అనూష,సైనిక్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సాయిల్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సైనిక్ స్కూల్లో కబడ్డీ




క్యాంపు నిర్వహించడం ఆనందదాయకమని, క్రీడాకారులు ప్రతిరోజు క్రమశిక్షణతో శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారని రాష్ట్రస్థాయి పోటీలో వరంగల్ జిల్లా జట్టు విజయం సాధించాలని కోరారు.ఈ యొక్క కార్యక్రమంలో వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి ముఖర్జీ ,సహాయ కార్యదర్శి కక్కెర్ల మల్లికార్జున్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవీందర్, నర్సంపేట స్టేడియం ఇన్చార్జి కబడ్డీ కోచ్ యాట రవికుమార్ ముదిరాజ్, సైనిక్ స్కూల్ లెఫ్టినెంట్ కల్నల్ కిరణ్, సైనిక్ స్కూల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం మహేష్,తిరుపతి మరియు కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు..

# ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు..

**-నాలుగు ఎకరాల్లో 14 టన్నుల దిగుబడి సాధించిన రైతు**

సందేశం టైమ్స్





ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని గాంధారి మండలానికి చెందిన రైతు శానం భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలో గెలల కోత కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతు భాస్కర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు తన నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ తోట నుంచి సుమారు 14 టన్నుల దిగుబడి పొందినట్లు తెలిపారు. ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ సాగుకు తక్కువ శ్రమ, తక్కువ నీటి వినియోగం అవసరమవుతుందని, తద్వారా సాగు ఖర్చులు తగ్గి మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.అంతేకాకుండా ఆయిల్‌పామ్ గెలలను సంబంధిత కంపెనీ కొనుగోలు చేస్తుండటంతో మార్కెటింగ్ విషయంలో రైతులకు భరోసా ఉంటుందని పేర్కొన్నారు. మరింత మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జ్యోతి, మండల ఉద్యాన శాఖ అధికారి సుమన్, హిందుస్థాన్ యూనిలీవర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ చంద్రబాబు, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, క్లస్టర్ మేనేజర్ సాయికుమార్, ఫీల్డ్ ఆఫీసర్లు రవీందర్, ప్రదీప్తో పాటు ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
నిజం దాగదు - వార ఆగదు
Published by తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్
26-09-2026

# వందేమాతరం.. జాతీయ చైతన్యానికి ప్రతీక

- ప్రతి పాఠశాలలో, ప్రతి కార్యక్రమంలో వందేమాతరం గీతాన్ని ఆలపించాలి
- వేంపల్లి ప్రతాప్ ఆర్ఎస్ఎస్ ప్రాంత గ్రామ వికాస్ సహ సంయోజక్ ఆర్మూర్ ఎస్ ఎస్ కే సమాజ్ అధ్యక్షుడు గటడీ ఆనంద్ సీనియర్ (న్యాయవాది)

సందేశం టైమ్స్

వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కమ్మర్‌పల్లిలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ ఆర్మూర్ పాఠశాల ఆధ్వర్యంలో క్షత్రియ కళ్యాణ మండపం లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన వేంపల్లి ప్రతాప్.ఆర్ఎస్ఎస్ ప్రాంత గ్రామ వికాస్ సహ సంయోజక్ మాట్లాడుతూ.. బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో జాతీయ చైతన్యాన్ని రగిలించిన నినాదంగా నిలిచిందన్నారు.వందేమాతరం గీతాన్ని బంకించంద్ర ఛటర్జీ రచించారని, అనంతరం ఆయన రచించిన 'ఆనందమఠం' నవలలో భాగంగా 1882లో ప్రచురితమైందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఈ గీతం ప్రజల్లో దేశభక్తి, జాతీయ ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు.

## స్వదేశీ ఉద్యమానికి ఊపిరిగా ..

1905లో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్‌ను విభజించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమైందని ప్రతాప్ పేర్కొన్నారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా సాగిన స్వదేశీ ఉద్యమంలో వందేమాతరం గీతం ప్రజలను ఏకం చేసే శక్తిగా మారిందన్నారు. బ్రిటిష్ వస్తువులను బహిష్కరించడం, స్వదేశీ వస్తువులను వినియోగించడం, జాతీయ విద్యను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు ఉద్యమంలో భాగమయ్యాయని వివరించారు.బెంగాల్‌కు మాత్రమే పరిమితం కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలకు స్వదేశీ ఉద్యమం విస్తరించిందని తెలిపారు. ఆంధ్ర ప్రాంతంలోనూ ఉద్యమం ఉధృతంగా సాగిందన్నారు.

## ప్రతి పాఠశాలలో ఆలపించాలి

వందేమాతరం గీతం దేశభక్తి, జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్న ఆయన.. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వందేమాతరం గీతాన్ని ఆలపించాలని కోరారు. ప్రతి పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించేలా విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్మూర్ ఎస్ ఎస్ కే సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది) పల్లె గంగారెడ్డి , పసుపు బోర్డు ఛైర్మెన్, భాజపా సీనియర్ నాయకులు, గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది) అడ్వకేట్, క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు రవినాథ్ జిల్లా కార్య దర్శి, పాఠశాల అధ్యక్షులు వంశీ,, కార్య దర్శి ప్రసన్న గౌడ్ ,సహ కార్యదర్శి రజినీకాంత్ ,పాఠశాల నిర్వాహకులు భాను తేజ్ ,అభిమన్యు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినోద్ కుమార్ ,వివిధ పాఠశాలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

- కేంద్రంతో మాట్లాడి వరంగల్‌కు నిధులు, కీలక సంస్థలు తీసుకురావాలని సీఎంకు విజ్ఞప్తి
- కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధుల కోసం కేంద్రాన్ని కోరాలని అభ్యర్థన
- వరంగల్ పురావస్తు మ్యూజియానికి కేంద్రం నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించాలని విజ్ఞప్తి
- వరంగల్‌లో నైలిట్ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని కోరిన ఎంపీ
- సీఐటీడీ కేంద్రం ఏర్పాటుతో యువతకు ఆధునిక సాంకేతిక శిక్షణ అవకాశాలు
- వరంగల్‌లో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం కోసం కేంద్రాన్ని కోరాలని సీఎంకు విజ్ఞప్తి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

సందేశం టైమ్స్

వరంగల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కలిసి వినతిపత్రాలు అందజేశారు.కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధుల మంజూరు,వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర నిధులు, వరంగల్‌లో నైలిట్,సీఐటీడీ కేంద్రాల ఏర్పాటు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం పి ఎస్ కె ఏర్పాటు అంశాలను ముఖ్యమంత్రికి ఎంపీ వివరించారు.

## కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధులు:

కాకతీయ యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు పీఎం-ఉషా పథకం కింద ప్రతిపాదించిన నిధులను కేంద్రం నుంచి త్వరగా మంజూరు చేసి విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు. విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధన, మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు, పరిశోధకులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు.

## పురావస్తు మ్యూజియానికి రూ.10 కోట్లు:

వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించేలా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి గారిని ఎంపీ కోరారు. 1991లో ఏర్పాటు చేసిన ప్రస్తుత మ్యూజియం భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త మ్యూజియం భవన నిర్మాణం 2023 మేలో పూర్తయినప్పటికీ కళాఖండాల తరలింపు, పరిరక్షణ, ప్రదర్శన వసతులు, భద్రత, వాతావరణ నియంత్రణ తదితర పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. 2026-31కు సంబంధించిన సవరించిన మ్యూజియం గ్రాంట్ పథకం మార్గదర్శకాలు వెలువడిన అనంతరం ప్రతిపాదన సమర్పించాల్సి ఉన్నందున, ఆ మేరకు కేంద్రంతో సమన్వయం చేయాలని కోరారు.

## వరంగల్‌లో నైలిట్ కేంద్రం:

వరంగల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో మాత్రమే ఉన్న ఈ సంస్థకు వరంగల్‌లో కేంద్రం ఏర్పాటు చేస్తే వరంగల్‌తో పాటు పరిసర జిల్లాల విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఏ ఐ , సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ తదితర రంగాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ, ధ్రువపత్రాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

## సీఐటీడీ ఏర్పాటుకు విజ్ఞప్తి:

వరంగల్‌లో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు, నైపుణ్యం కలిగిన యువత, ఎంఎస్ఎంఈలకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. టూల్ అండ్ డై డిజైన్, సీఏడీ/సీఏఎం, సీఎన్‌సీ మిషనింగ్, మౌల్డ్ తయారీ, ప్రెసిషన్ ఇంజినీరింగ్, రోబోటిక్స్, ఆటోమేషన్, 3డీ ప్రింటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందించడంతో పాటు స్థానిక పరిశ్రమలకు సాంకేతిక సహకారం లభిస్తుందని వివరించారు. కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖతో సంప్రదించి ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

## పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలి:

వరంగల్‌లో ప్రస్తుతం ఉన్న పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం స్థానంలో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.



2017 మార్చి 29న ఏర్పాటు చేసిన పి ఓ పి ఎస్ కె ద్వారా ప్రాంత ప్రజలకు సేవలు అందుతున్నాయని, పాస్‌పోర్ట్ సేవలకు డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. తత్కాల్ పాస్‌పోర్ట్ సేవల కోసం కరీంనగర్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వరంగల్-హనుమకొండ-కాజీపేట త్రినగర ప్రాంతంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలకు ప్రయోజనం చేకూరేలా తగిన మౌలిక వసతులు, సిబ్బందితో పూర్తిస్థాయి ఏర్పాటు చేయాలని కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడాలని ముఖ్యమంత్రిని ఎంపీ కోరారు.వరంగల్ ప్రాంత విద్యార్థులు, యువత, పరిశోధకులు, ప్రజలకు మెరుగైన విద్య, నైపుణ్య, సాంకేతిక, కేంద్ర ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించే చర్యలకు కేంద్ర సహకారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున చొరవ చూపాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. అలాగే వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ప్రస్తావించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయా ప్రతిపాదనలపై సంబంధిత శాఖలతో చర్చించి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య వెల్లడించారు.

# గణపతి విగ్రహ దాత దంపతులకు ఘన సన్మానం..

సందేశం టైమ్స్



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రేణుక నగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గణపతి విగ్రహాన్ని అందజేసిన దాతలు దుర్గారెడ్డి--దీప దంపతులను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. అలాగే స్వామివారి పట్టు వస్త్రాల వేలం కార్యక్రమంలో ఆశం అరవింద్ గౌడ్, అనన్య పాల్గొని వేలంలో పట్టు వస్త్రాలను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ. గణేష్ ఉత్సవాలను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉత్సవాలకు సహకరిస్తున్న దాతలు, కాలనీవాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# న్యూ లైఫ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణనాథుని నిమజ్జనం

- పూజ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి మాజీ చైర్మన్ గుడి మల్లయ్య
- ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లు గూడెం కల్పన నాగరాజు పట్లోళ్ల రేఖ ప్రవీణ్ మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు (నాని )



సందేశం టైమ్స్

ఆందోల్ నియోజకవర్గం జోగిపేట మున్సిపల్ పట్టణంలో వినాయక నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగాయి పట్టణంలోని పలు వినాయకుల మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేసినా అనంతరం వినాయకులను ఆందోల్ చెరువులో ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనం చేశారు జోగిపేట పట్టణంలోని 11వ వార్డులో న్యూ లైఫ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జనం కార్యక్రమం ప్రారంభమైంది యువకులు భక్తి పరవశంతో చిందులు వేస్తూ ఉత్సాహాన్ని నింపారు వార్డులోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాటాలు ఆడుతూ అందరిని ఆకర్షించారు గణనాథుని నిమజ్జన శోభాయాత్ర మధ్యరంగం మీదుగా గౌని పోచమ్మ గుడి హనుమాన్ చౌరస్తా మీదుగా గంగమ్మ ఒడికి చేరుకుంది తదనంతరం చెరువు వద్ద పూజ చేసి గణనాథున్ని చెరువులో నిమజ్జనం చేశారు ఈ కార్యక్రమంలో న్యూ లైఫ్ యూత్ సభ్యులు వార్డులోని మహిళలు చిన్నలు పెద్దలు ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# బిర్రం వెంకటేశ్వరరావు ని పరామర్శించిన తాటి



సందేశం టైమ్స్

అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, ప్రముఖ రైతు బిర్రం వెంకటేశ్వరరావు అనారోగ్యంతో వైద్యం పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొట్ట రాజులు ,ఉప్పల మురళి, ఉప్పల ప్రసాద్ నల్లపు రామారావు, శెట్టిపల్లి రఘురాం గారు,ముస్తఫా డాక్టర్ , బయ్య సత్తిబాబు, లోకం సాంబశివరావు, సత్తయ్య,మైలవరపు మల్లి, దుర్గారావు, నాగేశ్వరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో అక్రమ బెల్టు షాపుల దందా: తహసిల్దార్‌కు గ్రామస్థుల వినతి!

సందేశం టైమ్స్



మండల వ్యాప్తంగా విచ్చలవిడిగా వెలిసిన అక్రమ బెల్టు షాపులను తక్షణమే తొలగించి, రవాణా మరియు అధిక ధరల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ప్రజలు తహసిల్దార్‌కు శనివారం రోజున వినతిపత్రం సమర్పించారు. కూలీల రక్తం పిండుతున్న బెల్టు షాపులు:గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆదివాసీ గిరిజన పల్లెల్లో గుడులు, బడులు మరియు రహదారుల ప్రక్కనే అనుమతి లేని బెల్టు షాపులు ఏర్పాటు చేసి ఇష్టారాజ్యంగా మద్యం విక్రయిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని గిరిజన కూలీలు, కష్టపడి సంపాదించిన సొమ్మును ఈ బెల్టు షాపుల్లోనే తగలేస్తున్నారని, దీనివల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా చిన్నభిన్నమై రోడ్డున పడుతున్నాయని ఆందోళన చెందారు.

రూ. 90 అదనపు దోపిడీ -- సర్కార్ ఆదాయానికి గండి:ప్రభుత్వ ఎక్సైజ్ నిబంధనలను బొందపెట్టి క్వార్టర్ సీసాపై ఏకంగా రూ. 90 వరకు అదనంగా వసూలు చేస్తూ మద్యం వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎక్సైజ్ అధికారుల నియంత్రణ లోపం మరియు కొందరు రాజకీయ నాయకుల అండదండలతోనే కోట్ల రూపాయల అక్రమ మద్యం వ్యాపారం సాగుతోందని ఆరోపించారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికల ప్రకారం రాష్ట్రంలో అక్రమ మద్యం వలనే నేరాలు ఎక్కువవుతున్నాయని, లూజు అమ్మకాల వల్ల గిరిజనులు అనారోగ్యానికి గురై మరణిస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. ముఖ్యమైన డిమాండ్లు:అక్రమ కేంద్రాలపై దాడులు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఎక్సైజ్ బృందాలతో దాడులు నిర్వహించి అక్రమ నిల్వలను సీజ్ చేయాలి. క్రిమినల్ కేసులు: నిబంధనలు ఉల్లంఘించి బెల్టు షాపులు నడిపే నిర్వాహకులపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. అధిక ధరల అడ్డుకట్ట: ఎమ్మార్పీ () కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయించే మద్యం షాపుల లైసెన్సులను రద్దు చేయాలి.ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో స్థానిక నాయకులు, గ్రామస్థులు జుజ్జూరి చెన్నారావు, కలపాల మంగ రాజు, కంటే కేశవ రావు, వుకే ముత్యయ్య దొర, తగరం రాంబాబు, ఎస్. సాయి కుమార్, కే. ప్రభాకర్, సంగసాని. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కొడిశెలగూడెం గ్రామస్తుల విన్నపంపై క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించిన ఎమ్మెల్యే జారె



సందేశం టైమ్స్

కొడిశెలగూడెం గ్రామస్తుల విన్నపంపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి సాధ్యాసాధ్యాల పరిశీలన చేశారు పంటపొలాల మీదుగా సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ కాలువ వెళ్లడం వల్ల కాలువ అవతలి వైపు ఉన్న తమ పొలాల్లోకి వెళ్లడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున సమస్యను పరిష్కరించాలని కోరారు రైతుల విజ్ఞప్తి మేరకు ప్రాజెక్ట్ ఉన్నతాధికారులతో కలిసి కొడిశెలగూడెం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు కెనాల్ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి బ్రిడ్జ్ నిర్మాణానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు

# ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

సందేశం టైమ్స్



మల్లాయిగూడెం గ్రామ పంచాయతి మల్లాయిగూడెం గ్రా మంలో లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం లో భాగంగా దోమలు నివారణ చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లొ సర్పంచ్ సంగం. వెంకటమ్మ /దుర్గారావు , కార్యదర్శి , ఆశ వర్కర్ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ఆరోగ్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలక మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్

ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు ఫార్మసిస్టులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.వైద్యులు, నర్సులతో పాటు ఫార్మసిస్టులు ఆరోగ్య రంగంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారని మంత్రి వెల్లడించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన మందులు అందించడంలో, సరైన మోతాదులో మందుల వినియోగంపై అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. 2026 సంవత్సరానికి గాను "ఫార్మసిస్టులు ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే భాగస్వాములు" అనే థీమ్‌తో అంతర్జాతీయ ఫార్మసిస్టుల సమాఖ్య (ఎఫ్ఐపీ) ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం అత్యంత సముచితమన్నారు మంత్రి శ్రీ



దామోదర్ రాజనర్సింహ గారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫార్మసీ వృత్తిని మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. నాణ్యమైన మందుల లభ్యతను మెరుగుపరచడానికి, ఫార్మసీ విద్యను ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నామన్నారు మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం లో భాగంగా ఆసుపత్రుల్లో, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల లోని మెడికల్ స్టోర్లలో ఫార్మసిస్టుల నియామకాలను దశల వారిగా భర్తీ చేస్తున్నామన్నారు. ఫార్మసిస్టులకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు వెల్లడించారు కోవిడ్ సమయంలో ఫార్మసిస్టులు చూపిన అంకితభావం, సేవా తత్పరత చిరస్మరణీయమన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వ ఫార్మసి ఆఫీసర్స్ భాగస్వామ్యం మరింత విస్తృతం కావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు ఆకాంక్షించారు. వారి వృత్తి జీవితం మరింత విజయవంతం కావాలని మంత్రి కోరుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని తన నివాసంలో మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు ఫార్మసిస్టులతో కలసి కేకు కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు.

# కేసరి అంజనేయులు గౌడ్‌కు ట్రైన్ ది ట్రైనర్ సర్టిఫికెట్ అందజేసిన ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ డా. గంపా నాగేశ్వరరావు

నమస్తే ఇందూర్ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్

నిర్మల్, సెప్టెంబర్ 24, 2026:ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైన్ ది ట్రైనర్ కార్యక్రమాన్ని కేసరి అంజనేయులు గౌడ్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ తరఫున ఆయనకు శిక్షణ పూర్తి చేసిన ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.నిర్మల్‌లో జరిగిన మెగా ఇంపాక్ట్ కార్యక్రమంలో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గురూజీ డా. గంపా నాగేశ్వరరావు మరియు రీజియన్ 19 అధ్యక్షులు వాడేకర్ లక్ష్మణ్ సమక్షంలో కేసరి అంజనేయులు గౌడ్ ఈ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.ఈ శిక్షణ ద్వారా ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, యువత, విద్యార్థులకు శిక్షణ, సంభాషణా నైపుణ్యాలు, ప్రేరణ, నాయకత్వ వికాసం వంటి అంశాల్లో మార్గదర్శకత్వం అందించేందుకు అవసరమైన జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కేసరి అంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు మరియు యువతలో ఆత్మవిశ్వాసం, నాయకత్వం, లక్ష్యసాధన, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడమే తన లక్ష్యమని తెలిపారు. తాను నేర్చుకున్న జ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడేలా పంచుకుంటానని పేర్కొన్నారు."నేర్చుకోండి -- ఎదగండి -- సేవ చేయండి -- నాయకత్వం వహించండి -- ప్రభావాన్ని సృష్టించండి""ఇంటికొక వక్త...




ఊరికొక శిక్షకుడు!" అనే లక్ష్యంతో యువతలో సానుకూల మార్పు తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని కేసరి అంజనేయులు గౌడ్ తెలిపారు.

# గ్రామాల్లో మూఢనమ్మకాలు

సందేశం టైమ్స్

మూఢనమ్మకాలు ఇంకా గ్రామాల్లో ఉన్నాయని దెయ్యం పట్టింది దెయ్యాన్ని పారదూలం అనే ఆలోచనతో బూర్గంపాడు మండలం జింకల గూడెం గ్రామంలో రెండు నెలల క్రితం జరిగిన విషయాన్ని నాలుగు రోజుల క్రితం బయటికి వచ్చిన వీడియో శుక్రవారం 25నసిపిఎం పార్టీ బూర్గంపాడు బృందం జింకల గూడెం వెళ్లి సకినాబీ అనే మహిళను అడిగి తెలుసుకోవడం జరిగింది సకీనబీ చెప్పిన మాటలు మా కుటుంబం సభ్యులే ఆ రకంగా చేశారు తప్ప నన్ను ఎవరు బలవంతం చేయలేదు. నాకు రెండు నెలల నుండి ఒంట్లో బాగోటం లేదు జ్వరం ఆరోగ్యం సరిగా లేకపోవడం వల్ల మా బంధువులు ఈ రకంగా చేశారు తప్ప నన్ను ఎవరు ఇబ్బంది పెట్టలేదని ఎవరు కొట్టలేదని ఇది కేవలం కొందరు కావాలని దుష్ప్రచారం చేశారని చెప్పడం జరిగింది. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు



మాట్లాడుతూ జింకలగూడం గ్రామాల్లో మూఢనమ్మకాల విశేషాలను ప్రజల్లో లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది అట్లనే పోలీసు వారు ఆ గ్రామంలో కౌన్సిలింగ్ ప్రజలకు ఇవ్వాల్సిన అవసరం కూడా ఉందని ఇవ్వాళ మానవుడు చంద్రమండలం అనేకమైన ప్రయోగాలతో ఆకాశానికి వెళ్లి తిరిగి వస్తున్న సైన్సు ఇవ్వాళ ముందుకొస్తుంది అందుకోసం ఇంద్రలోకం చంద్రలోకం అనేది ఎక్కడ లేదనేది స్పష్టంగా సైన్సు చెబుతుంది ఇవన్నీ బూటకం దెయ్యాలు అనేది మనకి కనబడుతుంది అలాంటి పరిజ్ఞానం కలిగిన ఈ ప్రపంచంలోనే ఇంకా ఇలాంటి మూఢనమ్మకాలు పుట్టక రాకుండా ఉండాలంటే ఆ గ్రామాలలో చైతన్యం కలిగే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత పోలీస్ అంతరంగం పైన ఉందని కూడా ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం అందుకు గ్రామంలో ఉన్న పెద్దల్ని అవగాహన కల్పించాలి ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు కేసులు పెట్టడం అనేది సరైనది కాదు కాబట్టి వారికి సరైన పద్ధతిలో సరైన అవగాహన గ్రామాలలో కౌన్సిలింగ్ చేసి వారికి జ్ఞానోదయం కల్పించే విధంగా ప్రభుత్వం ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్.కె అబీద గుంట క కృష్ణ ఎస్.కె హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# పేద ప్రజలను ఆదుకోవడం కోసం సీఎం రిలీఫ్ ఫండ్

**- పుల్కల్లో లక్ష ఇరువైవేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**



సందేశం టైమ్స్

ఆందోల్ నియోజకవర్గంమండల కేంద్రమైన పుల్కల్లో వైద్య ఖర్చుల నిమిత్తం పేద ప్రజలను ఆదుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకుంటుంది ఇందులో భాగంగా పుల్కల్ గ్రామానికి చెందిన మ్యాతరి మంజుల భర్త పెంటయ్య, ఈసోజీపేట సాయి కృష్ణ తండ్రి నరసింహులు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 60 వేల చొప్పున ఇద్దరికీ 1,20,000 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు ఇవ్వడం జరిగింది. వైద్య ఖర్చుల నిమిత్తం మాకు ఆదుకున్నందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహ కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని లబ్ధిదారులు అన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు ఉదయ్, వార్డ్ మెంబర్లు చింత నరేందర్, మన్నె రాములు, మంగలి రాజు, మన్నె విట్టల్, కనిగిరి దత్తు, దప్పూరి శ్రీశైలం, మేతరి శ్రీనివాస్, మంగలి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.